## నేడు టీటీడీ దర్శన టికెట్లు విడుదల

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): 2024 ఫిబ్రవరి నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్లను శుక్రవారం విడుదల చేయనున్నట్టు టీటీడీ వెల్లడించింది. ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో దర్శనం టికెట్లను అందుబాటులో ఉంచనున్నట్లు ప్రకటించింది. వసతులకు సంబంధించిన కోటాను విడుదల చేయనున్నది. మధ్యాహ్నం 3 గంటలకు ఫిబ్రవరి నెలకు సంబంధించి అద్దెగదుల టికెట్లు విడుదల చేస్తుంది. 2024 ఫిబ్రవరి 16న రథసప్తమి పర్వదినానికి సంబంధించి శ్రీవారి సేవ స్లాట్లను ఈ నెల 27న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నది. జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి శ్రీవారి సేవ, నవనీత సేవ కోటాను 27న మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నది. అదేరోజు మధ్యాహ్నం 3గంటలకు పరకామణి సేవ కోటాను విడుదల చేస్తుంది. ఈ సేవలను www.tirumala.org వెబ్‌సైట్‌లో భక్తులు బుక్ చేసుకోవచ్చు.

## విశాఖలో ప్రభుత్వ భవనాల కేటాయింపు

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): విశాఖలో 35 ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు భవనాలు కేటాయిస్తూ ఏపీ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రులు, ఉన్నతాధికారులు, కార్యదర్శులకు భవనాలు కేటాయించింది. రిషికొండ మిలినియం టవర్స్‌లో క్యాంపు కార్యాలయాలను హై లెవెల్ కమిటీ గుర్తించింది. శాఖల సొంత భవనాలు, స్థలాలను తొలి ప్రాధాన్యంగా వినియోగించాలని వెల్లడించింది. మొత్తం 2 లక్షల 27 వేల చదరపు అడుగుల ప్రభుత్వ భవనాల స్థలాలు, మిలినియం టవర్స్‌లో లక్ష 75 వేల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని గుర్తించింది.

















